



"రామం వాళ్ళ తండ్రికి ఒక్కడే. వెనకా, ముందూ మరెవరూ లేరు. ఆయన సంపాదించిన లక్షల ఆస్తికి ఏకైక వారసుడు. ఉబుసుపోక కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. అదే కాలేజీలో లత బి. ఎ. ఫైనల్. లత పీథి బడి మాస్టారుగారి పెద్దమ్మాయి. ముగ్గురు ఆడపిల్లలకు, ఇద్దరు మగాళ్ళకు అక్కయ్య. ఆమె ముఖంలో నిండిన అమాయకత్వం వల్లనో, ఆమె అందంలో దాగున్న ప్రత్యేక ఆకర్షణ వల్లనో రామం ఆమె రూపాన్ని మనసులో నిలుపు కున్నాడు. అలా నిలుపు కున్నట్టు తరుచు వ్యక్తపరిచేవాడు. రామానిది నిండైన విగ్రహం. అతని మాటల్లోని ఆకర్షణ శక్తి వల్లనూ, తనంటే కనపరిచే ఆసక్తి వల్లనూ లత రామానికి చేరువైంది. వాళ్ళకి పరిచయం ఎలా అయిందో, ఎలా పెరిగిందో వివరంగా చెప్పవలసిన పని లేదు.

సాయంత్రం మూన్‌లాండ్‌లో జాయింట్‌గా గోల్డ్‌స్పాట్‌తో కడుపులు తడుపుకోవటం, వచ్చిన కొత్త సినిమాల్ని కంబైండ్‌గా చూడటం వరకు వారి ప్రేమలత అల్లుకుంది. సెలవు రోజుల్లో సముద్ర తీరంలో కూర్చొని కెరటాలు వదిలి వెళ్ళే మెత్తని నురగను చూస్తూ, జరగబోయే కాలం గురించి తియ్యని కలలు 'కొంటుం'డే వారు కాలాన్ని వెచ్చిస్తూ. పట్టణానికి, జనానికి దూరంగా వెళ్ళి పచ్చిక తిన్నెల మీద కూర్చుని అస్తమిస్తున్న సూర్యుడు వెదజల్లే ఎర్రదనాన్ని చూస్తూ, మబ్బులతో సయ్యాటలాడే చంద్రుడి 'కుర్ర'తనాన్ని తూస్తూ, మధ్య మధ్య వేడి వేడి కోరికలను నంజుకునే వాళ్ళు. కాలం మధురంగా తరిగిపోతోంది. ఆ మాధుర్యంలో మునిగిన లతకు, రామానికి వారి అంతస్తుల మధ్య అడ్డంగా నిలిచిన అడ్డు గోడ తలపుకు రాలేదు.

రామం లతను తన స్వంతం చేసుకుందా మనుకున్నాడు. అనుకోవటమే కాదు, తన అభిప్రాయాన్ని తల్లితండ్రులకు చెప్పి, వారిని ఒప్పించా లనుకున్నాడు. వాళ్ళు అంగీకరించకపోతే ఆస్తిని కాలదన్ని, లత చేయి అందుకుని తన జీవితాన్ని పండించు కోవాలనుకున్నాడు. అంత గాఢంగా ప్రేమించాడు రామం లతను.

సరిగ్గా అదే సమయంలో... రామానికి లత చెప్పింది, ఆమెకు నెల తప్పిన సంగతి.

మరి కొందరు చెప్పారు ఆమె ప్రవర్తన మంచిది కాదన్న విషయాన్ని, ఆమెకు చాలా మందితో సంబంధమున్న సత్యాన్ని.

ఈ మాటలు వాళ్ళ అన్యోన్యం చూసి కుళ్ళిపోతున్న వెధవ లెవరైనా చెప్పి ఉంటే రామం అంతగా పట్టించు కునే వాడు కాదు.

లత, రామం సన్నిహితులు చెప్పడంతో నమ్మక తప్పలేదు. నమ్మకుండా ఉండలేక పోయాడు. రాత్రింబవళ్ళు తీవ్రంగా ఆలోచించాడు. ఆలోచనలతో మెదడు దిమ్మెక్కిపోయింది. మనసు వికలమై పోయింది. దావాపు పిచ్చివాడిలా తయా రయాడు. చాలా రోజుల వరకు ఆ దెబ్బ నుండి కోలుకోలేకపోయాడు.

ఎప్పుడో అప్లయ్ చేసిన వీసా అప్పుడే అందింది. దుఃఖసాగరంలో మునిగిన రామం వెంటనే అమెరికా వెళ్ళిపోయాడు, తనను పచ్చిగా మోసం చేసిన లతను, గతాన్ని గుర్తుకు తెచ్చే ఆ పరిసరాలను మరిచిపోయేందుకు.

కొత్త ప్రదేశం. కొత్త వాతావరణం. కొత్త పరిచయాలు. కొద్ది రోజుల్లోనే ఆ వాతావరణానికి అలవాటు పడ్డాడు రామం. మామూలు మనిషి అయాడు.

ఆరు సంవత్సరాల తరవాత అమెరికా నుండి తిరిగొచ్చాడు. పది రోజులు ఫ్రెండ్స్‌తోనూ, పార్టీల తోనూ సరి పోయింది. ఒక స్నేహితుని ఆహ్వానం మీద రామం వాళ్ళింటికి అతిథిగా వెళ్ళాడు. ఆ ఇంట్లో అడుగు పెట్టిన క్షణం రామం..."

చెప్పటం ఆపి కలవరపడే కళ్ళతో సముద్ర కెరటాల కేసి, నీలి మేఘాల కేసి చూడసాగాడు వేణు.

"ఊఁ తరవాత..." సిగరెట్ ముక్కను దూరంగా విసిరేసి కుతూ హలంగా అడిగాడు సతీష్.

# నాగభైరవ ఆంజనేయులు

ఒక్క క్షణం వేణు గుండె దడదడ లాడింది.

నోరు మెదపలేకపోయాడు.

"ఇంతకీ నీవు చెప్పింది..." సతీష్ సందేహాన్ని వెలిబుచ్చాడు.

"కథ!"

"...లా లేదు. జరిగిన సంఘటనలా ఉంది. అసలు కథకు ప్రాణం ముగింపు. రచయిత తీసుకున్న సమస్యకు ముగింపులో పరిష్కారం చూపుతాడు. ముగింపు లేని కథ ఫిలమెంటు తెగిన కరెంట్ బల్బు లాటిది. సమస్యను పరిష్కరించని కథ వల్ల, వెలగని కరెంట్ బల్బు వల్ల ప్రయోజనం శూన్యం."

కాసేపు ఆగి మళ్ళీ సతీష్ అన్నాడు:

"నే నేం రచయితను కాదు నీ కథకు ముగింపు చెప్పటానికి. ఆ కథను వాకు చెప్పటంలో నీ అంతర్య మేమిటో అర్థం కావటం లేదు."

"అంతగా ఆలోచించవలసిన పనేం లేదు. ఊరికే తోచింది చెప్పాను." సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు వేణు.

"కథ ఎలా ఉన్నా, వర్ణన ప్రశంస నీయంగా ఉంది. ప్రయత్నిస్తే రచయిత కాగలవు." పలచగా నవ్వుతూ అన్నాడు సతీష్.

సతీష్ లేచి మిత్రుడికి చెయ్యి అందిం చాడు. ఇద్దరూ కారు దగ్గరకు నడిచారు మాటలు లేకుండానే.

• • •

దృష్టిని రోడ్డు మీద కేంద్రీకరించి సతీష్ కారును ముందుకు పరుగెత్తిస్తు న్నాడు. పక్కన కూర్చున్న వేణు తలఎత్తి సతీష్ ముఖంలోకి చూశాడు పరిశీలనగా. సతీష్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు వేణు పసి గట్టాడు గాని, దేన్ని గురించో గ్రహించలేకపోయాడు.

సతీష్ మనసులో గతం తాలూకు నీడలు మెల్లిగా చోటు చేసుకో సాగాయి.

• • •

తన గదిలో మంచం మీద పడుకున్న మాధవి మస్తిష్కం ఆలోచనలతో నిండిపోతూంది. మనసు స్థిమితంగా ఉండటం లేదు. ఏం జరుగుతుందో నన్న ఆందోళన. తాము అనుకుంటున్నట్లు జరిగితే బాగుండుననే ఆశ. అలా జరగదేమో నన్న భీతి.

గతం కళ్ళ ముందు కదిలింది.

"త్వరలో మన పెళ్ళికి ఏర్పాటు చేయించండి." తన చేతి గోళ్ళ నేచురల్ షేడ్‌ను చూస్తూ అడిగింది తను.

"నా మీద నీకు నమ్మకం లేదా?" మాటిగా ప్రశ్నించాడు గోపి.

"నమ్మకం లేకపోతే నీతో ఇంత చనువుగా తిరిగేదాన్ని కాదు."

"అలాటప్పుడు పెళ్ళికి తొందర లేముంది? ప్రేమకు పెళ్ళి పరమావధి కాదుగా!"

"కాకపోవచ్చు. కాని... పెళ్ళితో ప్రేమకు పరిపూర్ణత ఏర్పడుతుంది. ఇలా ప్రేమించుకుంటూ కాలం గడపటం మనకు అభ్యంతరం లేకపోవచ్చు. మన చుట్టూ ఉన్న జనం చూస్తూ ఊరుకో లేరు. మనకోసం కాకపోయినా ఈ సమాజం కోసమైనా వివాహం చేసుకో వటం చాలా అవసరం."

"అలాగే. ఐ విల్ ట్రై. ఇక వెళదామా!" గోపి పైకి లేస్తూ అన్నాడు.

లేచి నిలబడింది మాధవి. ఇద్దరూ చెట్టా పట్టా లేసుకుని హుషారుగా నడిచారు.

నెల తరవాత... ఫామిలీ రూమ్‌లో తను, గోపి ఒకరి కొకరు అభిముఖంగా కూర్చున్నారు. ప్లేటులోని జాంగ్రీ ముక్కను అతని పెదాల అంచు లకు అందించింది. గోపి పెదాలతో ఆ ముక్కను లోనికి తీసుకుపోయేంతలో చటుక్కున చేతిని తన వైపుకు లాక్కుంది.

"చీటిపి" అంటూ నవ్వుగా నవ్వాడు గోపి.

"వివాహం విషయంలో ఇంక జాగు పనికిరాదు."

"పరీక్షలయాక అమ్మాయిగారి మనసు పెళ్ళి మీదికి మళ్ళింది. అంత తొందరేం!" కవ్వింపుగా అడిగాడు.

"నెల తప్పింది." కనురెప్పలు దించు కుంటూ సిగ్గు పడింది.

"ఏమిటి?" తొట్రుపాటుతో కంగారుగా అడిగాడు.

"రెండో నెల నిండుతూంది." ఆ విష యం ఎత కుందానే చెప్పింది.

ఆ మాటతో గోపి ముఖం ఎలా మారిందో అప్పుడు చూడలేదు. తరవాత ఊహించింది.

"రేపే లేడీ డాక్టరు దగ్గర కెడదాం. వెరీ సింపుల్. ఈ బెడద నుంచి బయట పడవచ్చు." అతని స్వరంలో ఆందోళన.

విర్భాంతపోయింది తను.

"ఏమిటి మీ రంటున్నది?" తెప్పరిల్లి ఆశ్చర్యంగా అడిగింది, గోపి అభిప్రాయం ఖచ్చితంగా తెలుసుకోవాలని.

"తప్పేముంది? ఎంతమంది చేయించుకోవటం లేదు. పెళ్ళి కాకుండా వెం తప్పితే షేమ్. పరువు పోయిం పోతుంది?" ఎటో చూస్తూ అన్నాడు.

అప్పటికిగాని అతని స్వభావం తెలియ లేదు మాధవికి. అతని మీద అసహ్య మేసింది. సంస్కారం లేనివాడు. అతని మాటలు నమ్మి ముందాలోచన లేకుండా తొందరపడిన తన మీద తనకే వెగటు కలిగింది.

"అబార్షన్ అయాక ఎప్పటిలా మనం కలిసి ఉండచ్చు."

'ఛీ. . .ఛీ' మనసులోనే అనుకుంది. అతనికి పెళ్ళంటే అయిష్టం. ప్రేమ ముసుగులో ఆడపిల్లతో సరదాగా తిరగాలని మోజు.

ప్రేమించుకుంటూ, పెళ్ళి మాట తలవక ప్రేమతో సరిపెట్టుకునే అమ్మాయి కావాలి అతనికి.

తా నలా చేయలేదు.

మరోసారి అడిగింది గట్టిగా. అతని జవాబులో ఏ మార్పు లేదు.

"నేను చెప్పినదానికి అంగీకరిస్తే రేపు కలువు." అతి మామూలుగా చెప్పాడు గోపి.

విసురుగా లేచి బయటకు నడిచింది.

రెండు రోజుల తరవాత రిజిస్టర్ లెటరొచ్చింది తన పేర.

మాధవీ!

సంసారం, సంతానం అనే జంజాటంలో ఇరుక్కోవటం నా కిష్టం లేదు. మంగళ సూత్రం మాత్రమే స్త్రీ పురుషులను బంధించి వేస్తుందనుకోవటం వట్టి మూఢ నమ్మకం. కలిసి హాయిగా బతికితే సరిపోదూ! ఈ తతంగాలన్నీ దేనికి?

నీలో మరో ప్రాణి లేకుండా నీవు నీవుగా వస్తే ఎప్పుడూ స్వాగతమే పలుకుతుంది నా హృదయం. వారం రోజుల్లో నేను అమెరికా వెడుతున్నాను. ఈ లోగా అబార్షన్ చేయించుకుంటే నీవూ నాతో బాటు రావచ్చు. నేను వెళ్ళాక నీ మనసు మారి సముచిత నిర్ణయానికి వచ్చి, నేనే కావాలని నీ వనుకుంటే అమెరికా రావటానికి గాను ఇరవై వేలకు చెక్కు వ్రాసి పంపుతున్నాను. ఆలస్యమయినా నీవు నా దగ్గరకు రావచ్చు.

విత్ లవ్ . . .
—గోపి.

ఉత్తరాన్ని ముక్కలు చేసింది. దానితోబాటు చెక్కును చింపుదామనుకుంది. అలా చేస్తే ఆ చెక్కును నిరాకరించినట్టు అతని కెలా తెలుస్తుంది? తిప్పి పంపుదామనుకుంది. ఆ క్షణం లోనే మనసులో ఓ ఆలోచన, బరువుతో కూడిన తన బాధ్యత గుర్తు కొచ్చింది.

తండ్రి ఆర్థిక స్థితి, తనలో పెరుగుతున్న బిడ్డ కళ్ళ ముందు మెదిలాయి. డబ్బు లేకుండా బిడ్డను పెంచటం దుస్సాధ్యమే అవుతుంది. ఏది ఏమైనా అబార్షన్‌కు మన సంగీకరించలేదు.

ఇంట్లో మరెవరికీ తెలియకుండా చెక్కును మార్చింది. అప్పుడే డిగ్రీ చేతి కొచ్చింది.

అక్కడే ఉంటే. . . తన మూలంగా లోకం తన తల్లిదండ్రులను వేలెత్తి చూపుతుంది. కుటుంబ గౌరవం నాశన మవుతుంది. అది తను భరించలేదు.

తన వల్ల తన చెల్లెళ్ళ భవిష్యత్తులో చీకటి ముసురుకుంటుంది. వారి వివాహానికి తాను అడ్డు అవుతుంది. అది తను సహించలేదు.

స్నేహితురాలి తండ్రి ఉద్యోగం ఇప్పిస్తానన్నాడని దూరమయినా కుటుంబ ఆర్థిక స్థితి, చిన్నవాళ్ళ భవిష్యత్తు బాగుపడతాయని తల్లిదండ్రులతో చెప్పి వారిని నమ్మించి రైలెక్కింది.

కారు మోత వినబడడంతో ఆలోచనల నుండి బయట పడింది మాధవి.

* * *

కారు పోర్టికోలో ఆపి వేణుతో బాటు హాల్లోకి నడిచాడు సతీష్. అక్కడున్న సోఫాల్లో కూలబడ్డారు ఇద్దరూ.

పది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచి పోయాయి. ఎవరూ పెదవి కదపలేదు.

వేణు ఆ నిశ్శబ్దాన్ని భరించలేక పోతున్నాడు. సోఫాలో అసహనంగా కదులుతున్నాడు.

సతీష్ విషయాన్ని ఎలా కదపాలో ఆలోచిస్తున్నాడు.

"వేణూ! నీవు చెప్పిన కథలో హీరోయిన్ పేరేమిటి?" చాలా సౌమ్యంగా ప్రశ్నించాడు సతీష్.

"లత!" తక్కువ చెప్పాడు వేణు.

"నీవు చెప్పింది కథ కాదని ఇందాకే చెప్పాను. నేను అడుగుతున్నది కథలో పేరు కాదు. ఆమె అసలు పేరు." సతీష్ వేణు ముఖం లోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"నేను చెప్పింది కథేను!" వేణు నొక్కి పలికాడు.

ఏ విషయాన్నయినా సూటిగా చెప్పడు వేణు. అలా చెప్పే ధైర్యం అతనికి లేదు. ఆ సంగతి సతీష్‌కు బాగా తెలుసు. అందుకే మరో మార్గాన్ని ఎన్నుకున్నాడు.

"నీవు చెప్పింది మాధవి గురించి కదూ!" సూటిగా అడిగాడు సతీష్.

వేణు గుండె గుబుక్కుమంది. సతీష్ అంత సూటిగా అడుగుతాడని, అడగగలడని అత సూహించలేదు. తడబడ్డాడు వేణు. ఏదో చెప్పటానికి ప్రయత్నించాడు గాని, గొంతు పెగిలి మాట బయటకు రాలేదు.

"మాధవి గురించే కదూ!" అర్థింపు స్వరంతో మళ్ళీ అడిగాడు సతీష్.

వేణుకు కొంత ధైర్యం చిక్కింది. ఉత్సాహాన్ని పుంజుకున్నాడు.

"అవును, సతీష్, అవును. గతానికి సమాధి కట్టి, చీకటి బతుకు మీద ఘనపతెరలు కప్పి, నీ జీవితంలో స్థానం సంపాదించి, సంగనాచిలా ప్రవర్తిస్తూ నిన్ను మోసం చేస్తూ బతుకుతున్న మాధవి గురించే" అతి మెల్లగా ఒక్కో మాట వత్తి పలుకుతూ రహస్యం చెప్పినట్లు చెప్పాడు వేణు.

"అయితే, హీరో ఎవరు?" గంభీరంగా ప్రశ్నించాడు సతీష్.

అతని కళ్ళలో బరువైన బాధ తొంగిచూసింది... [కూడబలిగాడు] వేణు.

"ఎదురుగా ఉందిగా. ఆమెనే నిగ్గదీస్తే నిజం తెలుస్తుంది." కసిగా అన్నాడు వేణు.

"ఆధారం లేకుండా అడగటం అవివేకమే అవుతుంది. అయినా. . . నీకు తెలియదా?"

"తెలియదు."

"తెలియకుండా ఎలా చెప్పావు?"

"విన్న మాటల్ని బట్టి. నీ మీదున్న అభిమానం చేత. నీ బతుకు మోస పోయిందన్న ఆవేదన వల్ల."

"ఇప్పుడు నాకు చెప్పటంలో నీ ఉద్దేశం?"

"ముసురుకున్న చీకటిని తొలగించుకుంటావన్న నమ్మకం."

సతీష్ సోఫాలో నుంచి లేచి పచార్లు చేయసాగాడు. కుడి చేత్తో నుదురు రుద్దుకున్నాడు. అతని వాలకం చూసి తాను చెప్పిన దానికి సతీష్ మనసు గాయపడిందని ఊహించాడు వేణు.

సతీష్ వేణుకి దగ్గరగా వచ్చి—"కథలో రావూనివి నీవు కదూ!" అనిగట్టిగా అడిగాడు.

వేణు బిత్తరపోయాడు.

"కాదు. . . కాదు. . ."

సతీష్ వేణు కళ్ళలోకి తీక్షణంగా చూశాడు.

వేణుకి భయమేసింది.

"నో. . నో. . . ఐ డోంట్ నో ఎనీథింగ్." గట్టిగా అరిచాడు.

"ఐ. . . నో. . . ఎవ్విరిథింగ్. డోంట్ బ్లఫ్." కఠినంగా అన్నాడు సతీష్.

"నీ వేదో నాటక మాడుతున్నావు. నన్నేదో ఉచ్చులో ఇరికించాలని చూస్తున్నావు. ఐ యాం నాట ఫూల్!" ధైర్యం కోల్పోతున్నా దబాయించాడు.

"నాటకం. ఇప్పుడే చూపిస్తా." గద్దిస్తూ అని లోపలి గదిలోకి పెద్ద పెద్ద అంగలతో వెళ్ళాడు.

సతీష్ లోపలికి ఎందుకు వెళ్ళాడో అర్థం కాలేదు. మాధవిని తీసుకొచ్చి చెప్పిస్తాడేమో! అయినా, ఒప్పుకోకపోతే వాళ్ళేం చేస్తారు? అలా అనుకున్నా, మనసులో బెరుగ్గా ఉంది.

జాలరి చిత్రం డి. వి. సురేందర్ (జగిత్యాల)



లేచి వెళ్ళి పోదామనుకున్నాడు. అంతలో సతీష్ అడుగుల చప్పుడు వినబడింది.

వేణు ఊహకు రూపు నిస్తూ మాధవితో తిరిగి రాలేదు సతీష్. అతడు 'అతడు'గానూ రాలేదు. ఒక బాబును ఎత్తుకొని సతీష్ హాల్లోకి వచ్చాడు.

ఆ బాబుని చూసి వేణు గతుక్కుమన్నాడు.

చిన్నప్పటి తన ఫోటోకు ప్రతి రూపంగా ఉన్నాడు బాబు. వేణు మనసు లోపలి పొరల్లో నిద్రిస్తున్న పుత్ర వాత్సల్యం 'నా' అనే భావంతో తొలి సారిగా మేల్కొంది. మనసు ఆనందంతో తేలికైంది. లేచి ఆప్యాయంగా బాబుని అందుకోబోయ్యాడు. తనివితీరా ముద్దాడాలనుకున్నాడు. అంతలో చటుక్కున రెండడుగులు వెనక్కి వేశాడు సతీష్. వేణు నొచ్చుకుంటూ చూశాడు.

"ఆబ్సెన్స్‌లోనైనా మాధవి మాటను తోసి పుచ్చలేదు నీ సంతోషం కోసమైనా. అలా చేస్తే ఆమె మనసుతోబాటు నా మనస్సు క్షోభిస్తుంది. సారీ! మాధవికి ఇష్టం లేదు బాబుకి నీ స్పర్శ తగలటం. అందుకే నిన్నటి నుంచి బాబు నీ కంట పడలేదు."

"సుబ్బయ్యా!" పనివాడిని కేకేసి, బాబుని వాడితోబాటు బయటకు పంపాడు సతీష్.

వేణు ముఖం వివర్ణమయింది.

"ఇప్పుడయినా ఒప్పుకుంటావా బాబు తండ్రివి నీవేనని." ఎలా దబాయించగలడు మాధవికి చేసిన ద్రోహం సాక్ష్యంతో సహా కళ్ళెదుట కనబడుతూంటే!

వేణు తలా వత్తుకుని మౌనంగా కూర్చున్నాడు.

మౌనం అంగీకారానికి సూచనైతే వేణు అంగీకరించాడు.

తల వంచుకోవటం తప్పును ఒప్పుకోవటమే అయితే వేణు ఒప్పుకున్నాడు తన తప్పును.

సతీష్ కొంత కుదుటపడ్డాడు. ఉద్రేకాన్ని, కోపాన్ని అవతలపెట్టి మామూలు మనిషి అయాడు.

వేణు మెల్లిగా అన్నాడు: "మాధవి నన్నంతగా ద్వేషిస్తుందా?"

"నీవు చేసిన పని, నీ ప్రవర్తన అలాటివి." కటువుగా అన్నాడు సతీష్.

సతీష్‌కు తనమీద సదభిప్రాయం లేదని గ్రహించాడు వేణు. అంతేగాకుండా తను చేసిన పనిని గర్హిస్తున్నాడని తెలుసుకున్నాడు.

"సతీష్, భార్య బరువని, బిడ్డలు బాధ్యతలను పెంచి జీవితాన్ని నిస్సారమయం చేస్తారని భావించేవాడిని. ఏ బర్డన్ లేకుండా ఫ్రీ బర్డ్‌గా జీవించటంలో ఆనందముందని ఊహించేవాడిని. అందుకే అందిన అందాన్ని అనుభవిస్తూ 'నాది' అనేది లేకుండా చేసుకున్నాను. ఇప్పుడు తెలిసివస్తోంది నేను దేనిని జారవిడుచుకున్నానో, దేనికి దూరమయానో!" బాధగా నిట్టూర్చాడు. వేణు గొంతులో పశ్చాత్తాపం కనుపించింది.

సతీష్ వేణు ముఖంలోకి పరీక్షగా చూశాడు.

వేణు మెదడు చురుకుగా పని చేయసాగింది. జరిగినదాన్ని, జరుగుతున్నదాన్ని స్పష్టంగా సమీక్షించుకున్నాడు.

సంస్కారహీనుడుగా, సంకుచిత స్వభావిగా, వంచకుడుగా, మనసులేని మూర్ఖుడుగా, రోడ్ రోమియోలా — వివిధాల వెధవలా, రాస్కెల్ నంబర్ వన్‌లా మిత్రుడి మనసులో నిలిచిపోయాడు. పూచికపుల్లకున్న విలువకూడా లేకుండా పోయింది. స్నేహితుడుగా గౌరవించకపోయినా మనిషిగా కూడా విలువ లేకుండా పోయింది. మిత్రుని ముందు అంత చులకనవటం, వెయిట్ లేకుండా చేసుకోవటం ఎంత షేమ్! ఎలాగైనా కొంత సానుభూతిని సంపాదించాలి. సతీష్ తన మీద జాలిపడేలా చేయాలి.

"మిస్టర్ వేణుగోపాల్! నా కన్నీ తెలుసు. గతంలో జరిగినవే కాదు, నిన్న జరిగిన సంఘటన కూడా తెలుసు. నిన్న నేను ఆఫీసుకు వెళ్ళాక మాధవిని నీతో వచ్చేయమని బలవంత పెట్టావు. ఆమె దూషించేటప్పటికి ఆమె జీవితాన్ని నాశనం చేస్తానని బెదిరించావు." సతీష్ గొంతు గంభీరంగా, కంచు గంటలా మ్రోగింది.

వేణు కొంచెం బిగుసుకుపోయాడు. గురిచూసి పిస్టల్‌తో తన గుండెలోకి తూటాను వదిలినట్టు, బాకుతో కసిగా శరీరమంతటా తూట్లు పొడిచినట్టు అనిపించింది. నమ్మించి తీసుకువెళ్ళి నడిసముద్రంలో తోసేసినట్టు ఫీలయాడు. గాలి తీసుకోవటమే కష్టమనిపించింది. మనసు అవమాన జ్వాలలతో మండిపోయింది. నిస్సహాయస్థితికి హృదయం ఘనీభవించింది.

సతీష్ మాటలు విన్న క్షణంలోనే వేణు పక్షి అయినట్లయితే ఆకాశంలోకి ఎగిరేవాడు. కుందేలయినట్లయితే పరుగు లంకించుకునేవాడు. మాంత్రికుడైతే అదృశ్యమయిపోయేవాడు.

కాని ...

వేణు పక్షి కాదు; కుందేలు కాదు; మనిషి.

మామూలు మనిషి. మాంత్రికుడు కూడా కాదు.

అందుకే ఇంకా సోఫాలోనే కూర్చొని ఉన్నాడు.

అతని అవస్థను చూస్తూ సతీష్ అన్నాడు:

"అన్నీ తెలిసీ నిన్నేం చేయకుండా చచ్చు దద్దమ్మలా ఎలా ఉండగలిగానో విచిత్రంగా ఉంది కదూ! దానికి కారణాలు రెండు. ఒకటి—నీవు నా స్నేహితుడివి. స్నేహానికి నే నిచ్చిన విలువ అలాటిది; రెండు—మాధవి. మాధవి కిచ్చిన మాటను దాటలేను."

వేణు తనను తాను తమాయించుకున్నాడు. గొంతు సవరించుకొన్నాడు.

"సతీష్! క్షమించమని కోరే యోగ్యత నాకు లేకపోయినా, క్షమించగల విశాల హృదయం నీ కుందని తెలుసు. చేసిన తప్పులు నా మనసుని నలిపేస్తున్నాయి. గతాన్ని పాతిపెట్టి భవిష్యత్తును చక్కదిద్దుకున్నా, నేను దూరం చేసుకున్న స్వర్గం మళ్ళీ నాకు చేరువ కాలేదు. జరిగిన

---

## చరిత్రకందని అమర వీరులు

# త్రిలోక్ సింగ్ పంగ్తీ

## ఎ. పండరినాథ్

1920 నవంబరు 1 న ఉత్తర ప్రదేశ్‌లోని డర్‌కాట్ మల్లా జోహర్‌లో జన్మించిన పంగ్తీ త్రిలోక్ సింగ్ స్థానిక పాఠశాలలో మాధ్యమిక స్థాయి వరకు విద్యను ముగించుకుని దేశసేవా కార్యక్రమాల్లో అడుగిడాడు. ఆ నాటి దేశ పరిస్థితులు అతన్ని రాజకీయ జీవితంలోకి లాగాయి. దేశంలోని సామాన్య ప్రజానీకం పొందే దుర్భర జీవితం అతన్ని ఎంతగానో కలచివేసింది. అతడు పేద ప్రజానీకాన్ని ఆదుకోసాగాడు. ఆ వాడు అత డొక పెద్ద సాంఘిక కార్యకర్తగా పేరు తెచ్చుకున్నాడు.

1939 లో ముఖ్యంగా వెనకబడ్డ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అన్నివిధాలా సహకారాన్ని అందివ్వడంలో ఎంతో కృషి చేశాడు. వెనకబడ్డ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికై అతడు నిర్మాణాత్మక కార్యక్రమాన్ని రూపొందించాడు. ఎంతోమంది సాంఘిక కార్యకర్తల సహకారంతో గ్రామీణాభివృద్ధికి పూనుకున్నాడు.

అతడు చనౌదాలోని గాంధీ ఆశ్రమంలో కూడా పని చేశాడు. 1942 లో తల ఎత్తిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. ఈ ఉద్యమకాలంలోనే అతడు తన అనన్య ధైర్య సాహసాలను ప్రదర్శించాడు.

ఈ ఉద్యమకాలంలోనే అతడు చనౌదాలోని ఆశ్రమాన్నంతటినీ మూడు రంగుల జండాలతో అలంకరించాడు. ఈ చర్యతో బ్రిటిష్ ప్రభుత్వం భగ్గున మండిపోయింది. ఆశ్రమం చుట్టూ ఘెరావ్ వేసింది. దీనికి అలంకరించిన జండాల నన్నింటినీ తీసి పారవేయమంది. లేదా మిమ్మల్నందరినీ హత మారుస్తామంది.

క్షణంలోనే ఆ గ్రామంలోని ప్రజానీకమంతా అక్కడి కొచ్చేసింది. ప్రతి ఒక్కరూ జండాను చేతబట్టి "జై, స్వతంత్ర భారత్ కీ జై" అంటూ నినాదాలు చేయసాగారు. ఈ చర్యతో బ్రిటిష్ అధికారులు రెచ్చి పోయారు. త్రిలోక్‌సింగ్‌ను పట్టుకుని చావబాదారు. అయినా, అతడు చేతిలో జండాను అలాగే పట్టుకున్నాడు. జండాను పారవేయక పోతే చంపేస్తామన్నారు. అయినా, ఫరవాలే దన్నాడు. జండాను పట్టుకునే చనిపోతా నన్నాడు.

బ్రిటిష్ సైనికులంతా మూకుమ్మడిగా అతన్ని లాఠీలతో కొట్టారు. అతడు స్పృహ లేకుండా పడిపోయాడు. ఇది చాలక అతన్ని అల్మోరా జైల్లో పెట్టారు. అక్కడ అతని పరిస్థితి మరీ విషమించింది.

1942 అక్టోబర్ 10 న అతన్ని విడుదల చేసి అల్మోరా ఆస్పత్రిలో చేర్చారు. ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. అతడు 1942 డిసెంబర్ 26 న ఆస్పత్రిలో చివరి శ్వాసను విడిచాడు.

జాతీయ జెండాను చేతబట్టి పెద్ద పెద్ద బ్రిటిష్ అధికారులనే ఎదిరించిన త్రిలోక్‌సింగ్ ధైర్య సాహసాలు ఎంతేని మెచ్చుకో దగినవి. దేశం కోసం, తన ప్రజల కోసం ఆయన తన జీవితాన్నే త్యాగం చేశాడు. ఎంతోమంది దేశభక్తులకు మార్గదర్శకు డయ్యాడు. ☆

## మండే సూర్యుడు

ఇది!
ఉషఃకాలం
ఉదయగానం
ఆలపించే
ప్రగతిరావం
ధ్వనించే
సమయం!!
ఇది!
చీకటి
ఆఖరి శ్వాస
విడుస్తున్న
సమయం!
స్వార్థం, మోసం
దీపం పురుగుల్లా
మాడి మసి అవుతున్న
మండే సూర్యుని కాలం!
మానవత జై కొట్టే కాలం!!

— ఎల్లోరా

నిర్ణయానికి రాలేదు. ఇందులో నా స్వార్థం కూడా కొంత ఉంది."

ప్రశ్నార్థకంగా పార్వతమ్మ వైపు చూసింది మాధవి.

"అవును. శుభప్రదమైన నీ రాకతో నూతన శోభ చేకూరింది ఈ ఇంటికి. ఆ శోభను అలాగే నిలుపుకోవాలన్నదే నా ఆశయం." పార్వతమ్మ సంతోషంతో తన కోరికను బయట పెట్టింది.

మాధవి ఏం సమాధానం చెప్పలేదు. పార్వతమ్మ వైపు చూస్తూ కూర్చుంది.

కారు హారన్ వినబడటంతో పార్వతమ్మ లేచి హాల్లోకి వెళ్ళింది.

• • •

రెండో రోజు లాగి పార్వతమ్మ మాధవిని మళ్ళీ హెచ్చరించింది.

"ఎంత అభ్యుదయాన్ని సాధించినా, ఈ సమాజంలో స్త్రీ ఒంటరిగా బ్రతకలేదు. బ్రతకాలనుకున్నా, బ్రతకగలిగినా ఈ సంఘం అలా బ్రతకనీయదు" అని చెప్పింది పార్వతమ్మ.

"అపనిందలు మోస్తూ, అవహేళనలు భరిస్తూ ఒంటరి జీవితాన్ని గడపటానికి అలవాటుపడ్డదాన్ని నేను. నా గుండె, మెదడు బండబారి పోయాయి. అన్నిటికీ తట్టుకోగల కరకుదనం వాటో పేరుకు పోయింది."

"ఏదో ఒకటి మన అభీష్టానికి వ్యతిరేకంగా జరిగిందని జీవితం మీద విరక్తి పెంచుకోవటం సబబు కాదు."

"లేదమ్మా లేదు. జీవితం మీద రవ్వంతయినా ఆసక్తి లేదు. నా మనసు వెలిగించిన కర్పూరమైంది. కోరికలకు తావే లేదు. నా జీవితం, ప్రాణం బాబు. నేను బ్రతుకుతున్నదీ, బ్రతకవలసిందీ బాబుకోసం; బాబు భవిష్యత్తుకోసం."

పార్వతమ్మ మాధవి దగ్గరగా జరిగి ఆమె తలను ఆప్యాయంగా నిమురుతూ— "లోకులు వేసే నిందలు భరించగల చిత్తస్థైర్యం నీ కుండవచ్చు. లోకానికి ఎదురీద గలవేమో కూడా! ... కాదనను. కాని ... ఒకటి ఆలోచించు. నీ కున్న గుండెనిబ్బరం నీ కొడుక్కి ఉండక పోవచ్చు. నీ మనోధైర్యం నీ బాబుకి అబ్బకపోవచ్చు. పెరిగి పెద్దయాక చుట్టూ ఉన్న వారు తన జన్మను శంకిస్తుంటే, తండ్రిలేని భ్రష్టుడని హేళన చేస్తుంటే వింటూ సహించగలడా? సహించి ప్రశాంతంగా బ్రతకగలడా? తన తండ్రి ఎవరని నిన్ను నిలదీస్తే అప్పుడు దోషిలా తల వంచుకోవటం తప్ప ఏమని సమాధానం చెప్పగలవు? నీవు జరిగింది చెప్పినా మనస్ఫూర్తిగా నమ్మగలడా? నమ్మి నిన్ను పవిత్రమూర్తిగా భావించగలడా?

"నీకోసం కాకపోయినా, బాబుకోసం, బాబు ప్రశాంతంగా బ్రతకటంకోసం నీ వో నిర్ణయానికి వచ్చి తీరాలి. నీ పాప పాటు బాబు జీవితంలో మాయని మచ్చగా మిగిలిపోకూడదు. ఈ సమాజంలో పరువుగా బ్రతకటానికి బాబుకు ఒక తండ్రి తప్పనిసరిగా కావాలి.'

"నా మనసు వికలమై పోయింది. ఇప్పు డేమీ ఆలోచించలేకపోతున్నాను."

"పిచ్చిదానా! పలుగు దెబ్బలు తిన్న నేలలో నుండి పచ్చటి మొక్క మొలిచి నట్టే, వికలమైన మనసులోనుండి ఉదయ కిరణం తొంగి చూడాలి."

"నాకోసం, నా బాబుకోసం ఒకరి జీవితంలోని వెలుగును మింగెయ్యలేను. ఒక దీపం ఆర్పి మరో దీపాన్ని వెలిగించ లేను."

"దీనిలో చీకటి— వెలుగుల ప్రసక్తే లేదు. అసలు ఈ నిర్ణయాన్ని బయట పెట్టింది సతీషే. బాబుకు సతీష్ తండ్రి కావటానికి నీవు అంగీకరించాలి. దీనివల్ల నీకు కొంత మనస్తాపం కలగవచ్చు. గతాన్ని మరిచిపోవటం, భవిష్యత్తును చక్క దిద్దుకోవటం సజ్జనుల లక్షణం."

"నాకంతా అయోమయంగా ఉంది. ఏం అర్థం కావటం లేదు." అరచేత్తో నుదురు రుద్దుకుంటూ అంది మాధవి.

"మనసు కుదుట పడ్డాక ఆలోచించు. నిర్ణయం తీసుకోవలసింది ఆవేశంతో కాదు—ఆలోచనతో. ఆలోచించవలసింది జరిగిపోయిన గతాన్ని గురించి కాదు— జరగనున్న జీవితాన్ని గురించి."

పార్వతమ్మ మాధవికి ధైర్యం చెప్పి వంటగదిలోకి వెళ్ళింది.

• • •

నాలుగు రాత్రులు, మూడు పగళ్ళు కాలగర్భంలో కరిగిపోయాయి. ఆ మూడు రోజులూ పార్వతమ్మ మాధవి గదిలోకి పోలేదు. మాధవిని అలా ఒంటరిగా వదిలేస్తే త్వరలో ఒక నిర్ణయానికి రాగలుగుతుందని పార్వతమ్మ భావించింది. జరిగినదంతా సతీష్‌తో చెప్పింది. సంఘాన్ని ఎదిరించి, ఒడిదుడుకులను తట్టుకొని బాబుకోసం జీవిస్తున్న మాధవి తమ సూచనకు అంగీకారం తెలుపుతుందని సతీష్ భావించటం లేదు.

ఆ రోజు ... ఉదయం విచిత్రమయింది.

డైనింగ్ టేబిల్ ముందు కూర్చుని టిఫిన్ తింటున్నారు పార్వతమ్మ, సతీష్.

మాధవి గది తలుపులు తెరుచుకున్నాయి.

ఆ చప్పుడుకు ...

సతీష్ కళ్ళు అటు వైపు తిరిగాయి. పార్వతమ్మ చూపు గుమ్మం దగ్గర ఆగింది.

రెండు క్షణాల తరవాత మాధవి బయటకు వచ్చింది.

పార్వతమ్మ సంతోషంతో ఉక్కిరి బిక్కిరైంది.

సతీష్ రెపరెపలాడుతున్న గుండెను అదుపులోనికి తెచ్చుకున్నాడు.

మాధవి ఆరు సంవత్సరాల క్రితం వేణుగోపాల్ తగిలించిన ఉంగరాన్ని మెల్లగా తీసి కసిగాదూరంగా విసిరేసింది.

సతీష్ కుర్చీలోంచి లేచి వడివడిగా మాధవిని సమీపించాడు.

"అంకుల్ ... అంకుల్" అని అంటూ పరిగెత్తుకుంటూ వచ్చాడు బాబు.

సతీష్ సగం ముందుకి వంగి కుడిచేతి చూపుడు వ్రేలును పెదాలకు ఆనించుకొని "ష్ ష్... అంకుల్ కాదు ... ఈ రోజు నుంచి డాడీ" అని చెప్పి బాబుని ఎత్తుకున్నాడు ఉత్సాహంగా.

పార్వతమ్మ సజల నేత్రాలతో వారి వంక చూస్తూ కూర్చుంది.

సతీష్ మాధవిని డైనింగ్ టేబిల్ వద్దకు తీసుకు వచ్చాడు, ఆమె చేయి పట్టుకొని. చాలా రోజుల తరవాత ముగ్గురూ కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ ముగించారు.

• • •

బాబు కాన్వెంట్‌కు వెళ్ళాక సతీష్ మాధవితో చెప్పాడు:

"త్వరలో నాకు బెంగుళూరు ట్రాన్స్‌ఫర్ వస్తుంది. అక్కడ మాకు తెలిసిన వారుగాని, మన గురించి తెలిసినవారు గాని ఎవరూ ఉండరు. కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం. ఇకనుండి బాబు నా కొడుకు. వాడి తల్లి వాడిని కని చని పోయింది. అప్పటి నుండి అమ్మా, నీవూ కలిసి బాబుని సాకుతున్నారు. నీవు నా చెల్లెలివి.

"బెంగుళూరులో మన గురించి ఇలా చెప్పాలి. అలానే బ్రతకాలి. అప్పుడు ఏ సమస్యా ఉండదు. బాబుని నీ కొడుకుగా పెంచాలన్న నీ ధ్యేయాన్ని మరిచిపోవాలి. బాబు ఏ మచ్చా లేకుండా పరువుగా బ్రతకాలన్నదే ఇక నుండి మన ధ్యేయం.

"ఈ లోకం భార్యా వియోగుడైన మగవాడి మీద సానుభూతి చూపుతుంది గాని, పెళ్ళికాకుండా తల్లిఅయిన (కారణం ఏదైనా) ఆడదాన్ని క్షమించదు. అందుకే ఇలా చేయవలసివచ్చింది."

ఆనందంతో నోట మాట రాక, కృతజ్ఞత నిండిన కళ్ళతో సతీష్‌ను చూస్తూ ఉండిపోయింది మాధవి. ★